నేనూ, మా ఆవిడా మిగిలాం

నేను అందమైనవాణ్ణనిగాని, నా రూపం యింకొకర్ని ఆకర్షిస్తుందనిగాని, నేనెన్నడూ అనుకోలేదు. అనుకోడం అసంభవం. కాకిపిల్ల కాకికి ముద్దంటారుగాని, మా అమ్మకూడా నాముఖం ఒకటిన్నర నిమిషంకంటె యెక్కువసేపు చూడటం భరించలేకపోయేది. ముద్దుకి దగ్గిరచేరానంటే, "కొంచెంసేపు వెళ్ళి ఆడుకో నాయనా!" అనేది. యింక బంధువులు సరేసరి. దౌర్భాగ్యురాల్ని ఒక పిల్లని చిన్నప్పుడే నాకు కట్టాలనిగాని యెదిగింతరవాత నన్నుచూసి యెవతా పెళ్ళిచేసుకుని వుండదని నా దృఢనిశ్చయం. కాని నా భార్యకి తక్కినవాళ్ళకి లేని ఒక అదృష్టం కలిగింది. తనభర్త యెంగిలవుతాడనిగాని, తనని మరచిపోయి యితరులవలలో పడతాడనికాని, భయమూ, యీర్ష్యా యేమీ వుండనక్కరలేదు. పెద్ద వుత్సవంలోనైనా నేను మారిపోతాననిగాని, నన్నెత్తుకుపోతారనిగాని, మా అమ్మకే వుండేది కాదు బెంగ. నా మొహం కనపడకపోతేనే చాలునని, నే నడగ్గానే, ఆ వూళ్ళోనే బడిపంతులుపని యిచ్చేశాడు, ప్రెసిడెంటుగారు. నేను చదువుకునేప్పుడూ అంతే, చప్పున నన్ను ప్యాసుచేసి పైక్లాసుకి పంపేవారు నా టీచర్లు.

నామీద నిజమైన యిష్టంగలవారు మా హెడ్‌మాష్టరుగారొక్కరూ. ఆయన యింటికీ మా యింటికీ తాటాకుల దడిమాత్రమే అడ్డం. ఆయనభార్యకి దగ్గిరదగ్గిరగా నలభైయేళ్ళుంటాయి. ఆమెని చూడగానే పగలబోయే పచ్చని పెద్ద గుమ్మడిపళ్ళూ, నిండా దూదికూరిన మెత్తనిదిళ్ళూ, నిండు పాడిగేదెలూ, జ్ఞాపకమొస్తాయి.

అసలు మొదలు ఒక వుదయం. నేను దొడ్లోంచి వొస్తోవుంటే, యెవరో నావంక నిదానంగా చూస్తున్నట్టు, అనుమానం తగిలి, వెనక్కి తిరిగి చూస్తే, హెడ్మాష్టరుగారి భార్య రత్తమ్మగారు కనపడ్డారు. నేనేం తప్పు పని చేశానా, స్నానంచేసిననీళ్ళు మళ్ళా వాళ్ళదొడ్లోకి వెళ్ళాయా, పొద్దున్న నేను భార్యమీద వేసిన కేకలు వినపడ్డాయా, నామొహం అందానికి యింకా యేమన్నా కొత్తఅభివృద్ధి కలిగిందా అనుకుని తలొంచుకుని యింట్లోకి వెళ్ళి, నాభార్యతో ఆలోచించాను.

"యీవాళేమిటి? మీవంక అట్లా చాలాసేపట్నుంచి చూస్తోంది."

"ఛా!"

"నిజమే."

"యెందుకు?"

"ఏమో! అడగండి. చెప్పుతీసుకు కొట్టేవాడులేక!"

హడిలిపోయినాను. వాళ్లువింటే దీని అరుపులు!

"ఛీ! నోరుముయ్యి."

ఇదేమిటి? నా భార్యకికూడా యీర్ష్యేనా! అనుకున్నాను. కాని, నా ప్రతాపానికి గర్వం కలక్కపోలేదు. చివరికి నేనుకూడా ఘనతకెక్కాను. కాని నమ్మకం కుదరలేదు. నిజమా? వుత్త దీని అనుమానాలా?

మర్నాటినించి పక్కదొడ్డికేసి అప్రయత్నంగా నాకళ్లు తిరుగుతున్నాయి. నాకేమీ దురుద్దేశమూ లేదు, ఆశా లేదు. వూరికేనే, 'క్యూరియాసిటీ' ఆపుకోలేక చూశాను.

నేను దొడ్లోకి వెళ్ళినప్పుడల్లా అక్కడే వుండేది, బావిదగ్గిర. ఆ చూపులు! నావంక చూసే చూపులు, నన్ను లాగేయ్యాలనీ, నన్ను దగ్ధం చెయ్యాలనీ చూస్తున్నట్టుండేవి. నే నేమనుకోను? నమ్మడం ఎంత యిష్టం లేకపోయినా, యెట్లానమ్మక తప్పించుకోను? ఆచూపులూ, చిన్నాలూ—పన్నాలు పదిహేనేళ్ల పిల్లల్లోనూ నలభైయేళ్ల స్త్రీలలోనూ వొకటే. మొదట నమ్మలేదు నేను, తరవాత నిజమాఅని ఆలోచించాను. నిశ్చయమైన కొద్దీ, నేను కొంచెం పొజ్జలు మొదలుపెట్టాను. నేను యేం చేస్తున్నానో, యేలోకంలో వున్నానో తెలీదు. నన్నూ స్త్రీకోరింది. అందులో దబ్బపండు వంటి అందమైనది, అంతగొప్పది, హెడ్మాస్టరుగారి భార్య! నన్ను! నన్ను!

మెల్లిగా మాటలదగ్గిరికి, వెకిలినవ్వులదగ్గిరికి, దిగులుతో కంటు తడి దగ్గిరికీ వొచ్చింది మాస్నేహం! ఐనా నాకింకా అట్లాంటి తలపులేదు. దృఢంగా కలగలేదు.

అదేం చప్పుడు? మెలకువ వచ్చింది. నాభార్య చప్పుడు వొంటింటిలోనంటుంది. చప్పుడూలేదు, యేమీలేదు వెళ్ళనంటాను, భయంతో. నా ధైర్యాన్ని, మగతనాన్ని గెలిచేసి కర్రచేతికిచ్చి వెళ్ళమంది. కాని తాను

కదలదు. చివరికి పోరుపడలేక వంటింటి తలుపులుతీసి, లాంతరుతో వెతికాను. ఏమీలేదని దానికి కేకేశాను. "దొడ్డితలుపుకూడా తీసిచూడండి? అటిగెల కోసికళ్లారేమో?" భయంతో వొణుకుతున్న వేళ్ళతో తలుపుతీసి చూసేటప్పటికి ముందు తెల్లనిఆకారం కనపడ్డది. అరవడానికికూడా శక్తిలేక నిర్ఘాంతపోయి నుంచున్నాను. ఆమె కదిలి నన్ను రమ్మని సౌజ్ఞచేసిందాకా, రత్తమ్మగారనుకోలేదు. లాంతరు వొంటింటిలోనే వొదిలి, దొడ్లోకివెళ్లాను. వెంటనే నన్ను గట్టిగా కావలించుకుని, మెత్తని తన శరీరంమీద నన్ను యిటూ అటూ తిప్పుకుని, వెర్రిప్రేమ అంటో, అట్లాంటి వుపకారము చెయ్యకుండా సరిపుచ్చింది, చూపించింది. ఎన్నినిమిషా లయిందో! "యేమండీ! యేం చేస్తున్నారు" అన్న అరుపువిని వొదిలేసింది. వెళ్ళి పక్కమీద పడుకున్నాను.

నిజంగా, చెప్తున్నా. నా కామెతో యీ సంబంధం మొదట యేమీ యిష్టంలేదు. భయం వేసింది, అసహ్యమేసింది. కాని నావంటివాణ్ణి ఆమె కోరిందనే సంతోషమూ, నాకూ ప్రేమరాజ్యంలో స్థానమిచ్చినందుకు కృతజ్ఞతా, ఆమెమీద పోలేదు. పగలంతా యెంత యిష్టంలేకపోయినా, రాత్రి పన్నెండుగంటలకి అప్రయత్నంగా మెలుకువ వొచ్చి, అప్రయత్నంగా దొడ్లోకి వెళ్ళేవాణ్ణి. ఆమె, అంత గొప్పామె నాకోసం కాచుకొనివుంటే— నాకోసం! ఆగగలనా? ఇంక వెళ్ళింతరువాత ఆమె నన్ను వెర్రిగా భయంకరంగా మోహంచూపి వుపయోగించుకునేది. ఆమె అనుభవానికి ఆరాత్రే గడువన్నట్టూ ఇంక జీవితమే లేనట్టూ నన్ను నలిపేసేది. నాకు మాట్లాడ్డానికిగాని, వూపిరి పీల్చడానికిగాని, కాలుచేతులు కదపటానికిగాని వ్యవధానమివ్వదు. ఇట్లా అయిదారురోజులు జరిగింతరవాత ఒకరోజురాత్రి నేను తిరిగి పడుకోటానికి వొచ్చేటప్పటికి నా భార్య మేలుకునివుండి "యెక్కడికెళ్ళావు?" అంది.

"చప్పుడవుతో వుంటే వెతకడానికి వెళ్ళాను."

"ఆ రత్తమ్మగారేనా చప్పుడుచేసింది?"

చచ్చాను.

"యిదుగో! నేనూరుకోను. నేనూ కనిపెడుతోనేవున్నా. ఈవాళ రాత్రి వొచ్చాను. వెనకవేపు గొళ్ళెం వేసుకున్నారు. చిల్లుల్లోనించి కనపళ్ళే

దనుకున్నారా వెన్నెట్లో? రేపుపొద్దున్నే అడుగన్నా ఆముందని, యిదేంబుద్ధి అని? తెల్లారనీండి! ఆ వెంగు డేమంటాడో?"

యింకేముంది నాగతి! నామీద ఒక్కామెకి లోకములో ప్రేమవుంటే అదికాస్తా చెడక్కొట్టేసుకుంటా? అందులో ఆమె యేమనుకుంటుంది? విన్నవాళ్లు నమ్ముతారా? నవ్వరూ? దానికాళ్లు పట్టుకుని తెల్లవార్లూ బతిమాలి వొప్పించాను. యింకెప్పుడూ ఆమెకోసం వెళ్ళనని నా పితృదేవతలపేర్లు వరసగా చెప్పి, కాళ్లమీద ప్రమాణాలుచేస్తే అప్పుడు వూరుకుంది.

కాని మర్నాటిరాత్రి మళ్ళీ నా మనసు రత్తమ్మగారికోసం బాధించడం మొదలుపెట్టింది. నేను కావాలని స్త్రీ కోరడం, ఆ ప్రేమ చూపడం, మళ్ళీ నాకీ జన్మంలో దొరుకుతుందా? కాని యిది! దీన్నెట్లా వొదుల్చుకోడం?

రాత్రులు దొడ్డిదగ్గర వొకటే చప్పుడు. కిటికీలు, తలుపులు కొట్టడం, గోకడం. నా భార్య నన్ను గట్టిగా కౌగలించుకుని వొదలకుండా పడుకుని, చప్పుడు విని వొకటే నవ్వడం. నన్ను రత్తమ్మగారు కోరిం తరవాత నా భార్యకి నామీద మోజు కలిగినట్లు తోచింది. దీన్నీ, దీనిమోజునీ, వొదుల్చుకోడమెట్లా! నా మెడచుట్టూవున్న చేతులు లాగేసి పీక నొక్కాలన్నంత కోపమొచ్చేది. అసలు దాన్నిచూస్తే నాకు భయం. ముఖ్యం యెక్కడ పిల్లని కంటుందో, ఆ పిల్ల మొహం చూసినప్పుడల్లా, నా ముఖం జ్ఞాపకమొస్తుందేమో నని! దాని పుణ్యమా అంతవరకు. నాకే పిల్లలుంటే భరించలేక, సన్యసించి వుందును. నేను దొడ్లోంచి వెళ్ళినప్పుడల్లా రత్తమ్మగారు జాలిగా నావేపు చూస్తోంది. యేంచెయ్యను యీ భార్యని! వాళ్ల అత్తకి నెప్పులు ప్రారంభమైనాయని, అబద్ధంచెప్పి, సహాయం వెళ్ళమన్నాను. మూడేళ్లకిందట ఆ అత్తే నా రూపాన్ని వెక్కిరించిందనీ, అందువల్ల తాను తన తల్లిమొహం చూడ తలుచుకోలేదనీ అంది. వాళ్ళ పినతండ్రి పెంపుడుకూతురికి పెళ్ళి అనీ, తనకి మంచి చీరలు పెడతారనీ, వెళ్ళమన్నాను దొంగశుభలేఖ చూపి. పెళ్ళికి వెళ్ళడానికి తనకి చీరలూ, నగలూలేవంది. అప్పుచేసి బనారసుచీర కొన్నాను. రత్తమ్మగారిని నగలెరువడగమన్నాను. తనకి జ్వరంగా వుందనీ, బైటవుండే రోజులనీ, వెళ్లనంది.

చివరకి నిజంగానే బైటవుంది. ఆ రాత్రి తెగించి తలుపు తీసుకుని దొడ్లోకి వెళ్ళాను కాని రత్తమ్మగారు లేరు. మెట్లమీద కూచున్నాను. నామీద, నా పిరికితనంమీద అసహ్యంపుట్టి వెళ్ళిపోయింది. ఇంక రాదు— ఎంత బాధపడ్డదో పాపం! ఎంత గొప్ప అనుభవాన్ని, నా పిరికితనంతో పాటు పాడుచేసుకున్నాను. ఆమెదగ్గిర వున్నంతసేపూ వొణుకుతో భయంతో ఆమె మొహమన్నా సరిగా చూసి సంతోషించలేదు. ఈ నా పాడు జన్మకి మళ్ళీ అల్లాంటి అదృష్టం పడుతుందా? ఆ నిండు వెన్నెల వొదిలి వెళ్ళి పడుకోటానికి బుద్ధి వెయ్యలేదు. ఆనాడే నాకు కొంచెం ధైర్యం కలిగింది. భార్య అరిస్తే బాగా తన్న వొచ్చనిపించింది. చంపెయ్యనా, అన్నంత శౌర్యం కలిగింది. మెల్లిగా దడిదాటి, పక్కదొడ్లోకి వెళ్ళి కిటికీదగ్గిర గోకాను, ఆమె చేసినట్టే. రెండు నిమిషాల్లో మెల్లిగా వొచ్చింది, తలుపు తీసుకుని. పల్చని చీర కిందకనపడే ఆమె మెత్తని పచ్చని వళ్ళూ, కాటికపెట్టిన పెద్దకళ్ళూ, చిక్కగా వేళ్ళాడే జుట్టూ నా కళ్ళు తిప్పేశాయి.

ఆమెని అధికమైన కాపీసంతో కావిలించుకుని, మామూలు ప్రకారం చెట్టుకిందికి వెళ్ళే ఆలోచనన్నా లేక, అరుగుమీదనే నా బరువుతో కూలతోశాను. ఆమె కళ్ళల్లో ఆశ్చర్యం కనపడుతోంది. ఇదివరకటి మోహము కళ్ళలో వైరిని చూపించటం లేదేమో అనే సందేహం కలగడానికి వ్యవధి లేదు. ఆమెను, ఆమె సుందరతనాన్నీ, నాదిగా చేసుకోవాలని ప్రయత్నించాను. ఆ కళ్ళలోకి క్రమంగా అసహ్యము తోచింది. నా కింద చలించవలసిన ఈ మెత్తని దేహం బిగుసుకుంది. సన్నొక్క తోపుతోసి లేచి నుంచుని, బాధతో, అసహ్యంతో—నావంక రెండుమూడుసార్లు చూసి— "నిన్నా! నిన్నా! నిన్ను! పో, వెళ్లిపో, ముందు, పో .." యింకా బిగ్గరిగా అరుస్తుందనుకున్నాను. అంత ఆశ్చర్యంలోనూ బాధలోనూ, నీచత్వంలోకూడా, శక్తి తెచ్చుకుని మా యింటితలుపు దగ్గిరికి వెళ్లి ఆగిపొయ్యే ఆశతో వెనక్కి తిరిగిచూశాను. వెన్నెల కెదురుగా, బాధామూర్తి వలె నుంచుని.

"అయ్యో! అయ్యన్ని—మళ్ళీ ఎట్లా ఆయన మొహం చూడను! యేం

చెయ్యను !''. అని మెల్లిగా అంటూంది. ఆమె మొహం చూసి యింట్లోకి పరిగెత్తాను భరించలేక !

ఎంతసేపు నిద్రపోయినానో ! యేడుపులువిని లేచాను. పక్కయింటోకి పరిగెత్తాను. హెడ్మాష్టరుగారి భార్య కాలిపోయింది. హెడ్మాష్టరుగారు నన్నొక్కగదిలోకి పిలిచారు.

"నాతో చెప్పింది అంతా. నీ సౌందర్యం చూసి మోహించిందను కోకు. ఆమెని లోబరచుకున్న వొక గ్రహం బాధ అట్లాచేసింది. ఆ గ్రహం వొదలగానే ఆమె తెలుసుకున్నది. అటువంటి పతివ్రతా, నిర్మల చరిత్రా, యీ యుగంలో లేదు. తెలిసిందా !'' అని యెవరికి యీ సంగతి చెప్పనని గొప్ప వాగ్దత్తం చేయించుకున్నాడు.

మర్నాటినించి నాభార్య అందరితోనూ నన్ను రత్తమ్మగారు కోరిందనీ, తనమీది ప్రేమనాత నేను ఆమెను నిరాకరించాననీ, ఆ వ్యథతో కాల్చుకు చచ్చిపోయిందనీ పుకారు పుట్టించింది. మమ్మల్నిద్దరినీ రాత్రులు అనుమానంతో చూసిన యిరుగు పొరుగువాళ్ళు నిజమే నన్నారు. ఇంక వూరంతా పాకిపోయింది. గోడలమీద 'హెడ్మాష్టరుగారి భార్య యెందుకు పోయింది ?' అని రాశారు. నేను నా పనికి రాజీనామా యివ్వడం, నేనూ హెడ్మాష్టరుగారూ మాట్లాడకపోవడం రూఢిపరిచాయి, ఆ వార్తని.

హెడ్మాష్టరు విషంమింగి చచ్చిపోయినాడు.

పతివ్రతాతిలకం నా భార్యా, జగన్మోహనా కారుణ్ణి నేనూ, మిగిలాం.